సాక్షి జనగామ

శుక్రవారం | 1 | మార్చి | 2024



బాల మేధావుల భారత్.

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'యువవిజ్ఞాని' (యువిక) కార్యక్రమానికి దరఖాస్తులు కోరుతోంది. - 8లో▸



మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం

మేడారం హుండీల లెక్కింపు గురువారం ప్రారంభమైంది. మొదటిరోజు ఆదాయం రూ. 3,15,40,000 లభించింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం $36^0/21^0$

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కొంత మేర పెరుగుతాయి. రాత్రి పూట చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇంటర్ సెకండియర్ పరీక్షలు షురూ

- మొదటి రోజు 97.70 శాతం హాజరు



జనగామ రూరల్: ఇంటర్మీడియట్ సెకండియర్ పబ్లిక్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు సెకండ్ లాంగ్వేజ్ పేపర్–2 పరీక్షకు 4,170 మంది విద్యార్థులకు 4,074 మంది(97.70) హాజరయ్యారు. జనరల్ విభాగం 3,105 మంది విద్యార్థులకు 3,062, ఒకేషనల్ 1,065 మందికి 1,012 మంది పరీక్ష రాసినట్లు డీఐఈఓ శ్రీనివాస్ తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్‌ను ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు, పట్టణంలోని గాయత్రి, ప్రెస్టేజ్, మైనార్టీ స్కూల్, తేజస్వీ కళాశాల, నర్మెట జూనియర్ కళాశాల సెంటర్లను డెక్ సభ్యులు ఆంజనేయరాజు, శేఖర్ తనిఖీ చేశారు.

నేటి నుంచి టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు

జనగామ రూరల్: పదవ తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు నేటి నుంచి 11వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈఓ కె.రాము ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులకు పరీక్షలపై భయాన్ని తొలగించడానికి నవంబర్ నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహించామని, వెనుకబడిన విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపారని పేర్కొన్నారు. జిల్లాలోని 182 పాఠశాలల్లో 6,698 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయనున్నారని వివరించారు. మూల్యాంకనం ఎప్పటికప్పుడు చేపట్టి తప్పులు దిద్దుకునేలా చర్యలు తీసుకోనున్నట్లు పరీక్షల అధికారి చంద్రభాను, సహాయ కార్యదర్శి రామరాజు తెలిపారు.

3న పల్స్ పోలియో

జనగామ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించడానికి గురువారం పట్టణంలో వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 3న పల్స్ పోలియో చుక్కలను ప్రతీ చిన్నారికి వేయించాలని, పట్టణంలో 6,004 మంది ఐదేళ్ల లోపు పిల్లలు ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

విజయ సంకల్ప సభను జయప్రదం చేయాలి



జనగామ: జిల్లా కేంద్ర చౌరస్తాలో శుక్రవారం (నేడు) నిర్వహించే విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సభకు కేంద్ర మంత్రులు నారాయణస్వామి, రాష్ట్ర నాయకులు ఈటల రాజేందర్ వస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీఎల్ఎన్.రెడ్డి, వీరారెడ్డి, సౌడ రమేష్, శివరాజ్ యాదవ్, కక్ర శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పవన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

జనగామ రూరల్: ఫిబ్రవరి 9న నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు జిల్లా జడ్జి డి.రవీంద్రశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కేసుల పరిష్కారానికి రాజీ మార్గం ఒక్కటే అని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసు అప్పీల్ చేస్తే రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, వాస్తవానికి కోర్టులో సివిల్ కేసులపై చెల్లించిన రుసుము కూడా పరిష్కారమైతే తిరిగి చెల్లిస్తారని వివరించారు.

శిక్షణతో నైపుణ్యం పెంపొందుతుంది



జనగామ: శిక్షణతో నైపుణ్యం పెంపొందుతుందని సీజేఐటీ కళాశాల డైరెక్టర్ ఫాదర్ డి.విజయపాల్‌రెడ్డి అన్నారు. యశ్వంతపూర్‌లోని క్రీస్తుజ్యోతి కళాశాలలో మూడు వారాలుగా నిర్వహిస్తున్న అమేజాన్ టెక్నికల్ ట్రెయినింగ్ తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమేజాన్ ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ కంప్యూటింగ్‌లో నిష్ణాతులైన విజయరాఘవన్, కిరణ్ ఫైనలియర్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, ఐటీసీ రిలేషన్ షిప్ మేనేజర్ షేక్ గౌస్ పాషా, కళాశాల ట్రెయినింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ టి.అషర్ పాల్గొన్నారు.

'మెగా' ఆనందం

- డీఎస్సీ ప్రకటనతో నిరుద్యోగుల్లో ఆశలు
- జిల్లాలో పెరిగిన పోస్టుల సంఖ్య
- ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు

జనగామ రూరల్: డీఎస్సీ విషయంలో ఏళ్ల తరబడి కాలాయాపన జరిగింది. ఎట్టకేలకు రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చయడంతో నిరుద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఏడాది ముందు నుంచే పుస్తకాలతో కుస్తీ పడుతున్న బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు ఈసారి ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ప్రిపేర్ అవుతున్నారు. చివరి సారిగా 2018 సంవత్సరం అప్పటి ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్ ద్వారా టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ నిర్వహించింది. ఇప్పటికే జిల్లాలో ప్రకటించిన 76 పోస్టులకు గత నవంబర్‌లో నిర్వహించాల్సిన టీఆర్టీ పరీక్ష ఎన్నికల కోడ్‌తో నిలిపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పోస్టుల సంఖ్యను 221కి పెంచి డీఎస్సీకి సిద్ధమైంది. గతంతో ఓఎంఆర్ ద్వారా పరీక్ష నిర్వహించగా.. ప్రస్తుతం(సీబీటీ) కంప్యూటర్ బేస్డ్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

జిల్లాకు 221 పోస్టులు

ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో 11వేలకు పైగా పోస్టులను భర్తీ చేయనుండగా అందులో జిల్లాకు 221 కేటాయించారు. ఇక్కడ కెమిస్ట్రీ, ఇంగ్లిష్ పోస్టులు ఖాళీ లేవు. జిల్లా వ్యాప్తంగా ఎస్ఏ, ఎస్జీటీ పోస్టులు ఖాళీ ఉండగా ప్రమోషన్ ద్వారా 70(30శాతం), ఎస్జీటీ పోస్టులు వంద శాతం భర్తీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా మూతపడిన 19 పాఠశాలలపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ప్రభుత్వం వాటిని తెరిపించాలని భావిస్తోంది. ఇదిలా ఉండగా జిల్లాలో 442 ఖాళీ పోస్టులతో పాటు జీరో స్కూల్స్ 60 వరకు ఉన్నాయి. ఇప్పటికే ఉపాధ్యాయ అర్హత పరీక్షలో 10వేల మందికి పైగా అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించి ఆరు ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్నారు. కాగా మరోమారు టెట్ పరీక్ష నిర్వహిస్తే మరింత మంది అర్హత సాధించి పోటీపడే అవకాశం ఉంది.



గ్రంథాలయంలో చదువుకుంటున్న అభ్యర్థులు

జిల్లాలో ఖాళీ పోస్టులు	: 442
గత టీఆర్టీలో ప్రకటించినవి	: 76
ప్రస్తుతం డీఎస్సీ ద్వారా భర్తీ	: 221

ప్రస్తుతం డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్న పోస్టులు

స్కూల్ అసిస్టెంట్‌లు	50
లాంగ్వేజ్ పండిట్‌లు	21
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్	7
ఎస్జీటీలు	118
ఎస్ఏఎస్ అసిస్టెంట్లు	5
స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీలు	20

వెంటాడుతున్న టీచర్ల కొరత

జిల్లాలో మొత్తం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 508 ఉండగా.. 2,570 మంది ఉపాధ్యాయులకు గాను 2,125 మంది విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. సర్కారు స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత నెలకొంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులు భర్తీ చేయడం లేదు. పలు పాఠశాలల్లో ఐదేళ్ల నుంచి స్కూల్ అసిస్టెంట్‌లు, ఎస్జీటీలు, వ్యాయాయ ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందుతున్నా.. ఆ స్థాయిలో భర్తీ కావడంలేదు. దీంతో విద్యార్థుల చదువు, భవిష్యత్ ప్రశ్నార్థకంగా తయారైంది. ఉన్న ఉపాధ్యాయులపై బోధన భారం అధికమవుతోంది.

ఖాళీ పోస్టుల వివరాలు ఇలా..

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలు ఇలా ఉన్నాయి. గెజిటెడ్ హెచ్ఎంలు 63, పీఎస్‌హెచ్ఎంలు 58, ఎస్జీటీలు 118, ఎస్ఏ పీడీ 5, పీఈటీ 7, ఎస్ఏ మ్యాథ్స్ 22, ఫిజిక్స్ 9, బయోసైన్స్ 39, సోషల్ 54, ఇంగ్లిష్ 21, తెలుగు 14, హిందీ 7, ఎల్‌పీ తెలుగు 12, ఎల్‌పీ హిందీ 9, ఆర్ట్స్ 2, క్రాఫ్ట్ 2, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ 2 ఖాళీలు ఉన్నాయి.



పోస్టులన్నీ భర్తీ చేయాలి

2014లో బీఎడ్ పూర్తి చేశాను. ఎస్ఏ మ్యాథ్స్‌లో టెట్ క్వాలిఫై అయ్యాను. ప్రైవేట్ పాఠశాలలో ఉద్యోగం చేసుకుంటూ ప్రిపేర్ అవుతున్నాను. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు అన్యాయం జరగకుండా చూడాలి. జిల్లా కేంద్రంలో ప్రత్యేక స్టడీ సెంటర్ ఏర్పాటు చేసి, గ్రంథాలయంలో మరిన్ని పుస్తకాలు అందుబాటులోకి తేవాలి.

\- గుడిసెల శిరామకృష్ణ, నెల్లుట్ల

టెట్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలి



గతంలో మాదిరిగా కాకుండా ప్రభుత్వం కోర్టు కేసులు లేకుండా డీఎస్సీ నిర్వహించాలి. స్కూల్ అసిస్టెంట్ తెలుగు పోస్టులు పెంచాలి. టెట్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలి. ఐదేళ్ల నుంచి ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురుచూస్తున్నా.

\- లావుడ్య జవహర్‌లాల్, కొండాపూర్

ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులు పెంచాలి



ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో గంత కంటే అభ్యర్థుల సంఖ్య పెరిగింది. దానికి అనుగుణంగా పోస్టుల సంఖ్య పెంచాలి. మెగా డీఎస్సీని స్వాగతిస్తున్నాం. టీచర్ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా గడిచిన మూడేళ్ల నుంచి ప్రిపేర్ అవుతున్నాను.

\- కుసుమ సాయిరాం, జనగామ

ఏడాదిగా ప్రిపేర్ అవుతున్నా..



డీఎస్సీ కోసం ఏడాది నుంచి ప్రిపేర్ అవుతున్నాను. బీఎస్సీ, బీఈడీ, డీఈడీ చేశాను. ప్రైవేట్ స్కూల్‌లో బోధిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. పోస్టుల సంఖ్య పెంచడం ఆనందంగా ఉంది. ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ఉన్నాను.

\- వేల్ల సురేందర్, స్టేషన్‌ఘన్‌పూర్



మనీషా వివేక్, కాశిబుగ్గ, భువనగిరి ఆలేరు (మేల్ బేబీ)



అఖిల తరుణ్‌కుమార్, మల్కాజిగిరి (మేల్ బేబీ)



ప్రియాంక యాకూ బొమ్మెర, (ఫిమేల్ బేబీ)

లీప్ సెలబ్రిటీలు

జనగామ: ఏటా పుట్టినరోజు జరుపుకోవడం కామన్. నాలుగేళ్లకోసారి జరుపుకోవడం స్పెషల్. నాలుగేళ్లకోసారి వచ్చే లీప్ ఇయర్‌లో పిల్లలకు జన్మనివ్వడం ఆ తల్లిదండ్రులకు మరిచిపోలేని అనుభూతినిస్తోంది. జనగామ మాతా శిశు సంరక్షణ ఆరోగ్యకేంద్రంలో గురువారం(ఫిబ్రవరి 29) ఆరుగురు మహిళలు ప్రసవించారు. లీప్ సంవత్సరంలో బిడ్డకు జన్మనివ్వడంపై వారు ఆనందం వ్యక్తం చేశారు. మేల్ బేబీలు నలుగురు, ఫిమేల్ బేబీలు ఇద్దరు జన్మించారు.

మేడిగడ్డ.. పొలిటికల్ అడ్డా

- ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం పర్యటన
- నేడు మాజీ మంత్రి కేటీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ టూర్
- పార్లమెంట్ ఎన్నికల వేళ మరోమారు చర్చనీయాంశంగా కాళేశ్వరం

సాక్షి, వరంగల్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ ఇప్పుడు రాజకీయ అడ్డాగా మారింది. ఈ బ్యారేజీ పిల్లర్లకు పగుళ్లు ఏర్పడి పియర్లు కుంగిపోయిన ఘటన.. రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పెద్ద చర్చకే దారి తీసింది. దీనిపై నాటినుంచి పెద్ద దుమారమే రేగుతోంది. ప్రణాళిక లేకుండా చేసిన ప్రాజెక్టు నిర్మాణంతో ప్రజాధనాన్ని భారీగా దుర్వినియోగం చేశారని అధికార పార్టీ కాంగ్రెస్ నేతలు విమర్శిస్తుంటే.. ఎక్కడో ఒక చోట పిల్లర్లకు పగుళ్లు ఏర్పడితే దాన్ని భూతద్దంలో చూపి అసలు కాళేశ్వరం ప్రాజెక్ట్ వేస్ట్ అన్న తరహాలో కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారని ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు నేడు (శుక్రవారం) చలో మేడిగడ్డ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఇప్పటికే డిసెంబర్ 29న ఇంజనీరింగ్ విభాగాధికారులతో కలిసి కాంగ్రెస్ పార్టీ మంత్రుల బృందం మేడిగడ్డ వద్ద ఏకంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేసింది. దీంతోపాటు ఫిబ్రవరి 13న అసెంబ్లీ నుంచి ఏకంగా బస్సులో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరించి చేసిన నిర్మాణంతో వేలకోట్లు వృథా అయ్యాయంటూ విమర్శించారు. ఇప్పుడు దీనికి కౌంటర్‌గా ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ శుక్రవారం చలో మేడిగడ్డకు పిలుపునివ్వడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఏ మేడిగడ్డను చూపించి తమను బద్నాం చేస్తున్నారో, అక్కడే ఎన్ని పిల్లర్లు ఉన్నాయి, అసలు ఎన్ని దెబ్బతిన్నాయో జనాలకు చెప్పేందుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన ఆ పార్టీ బృందం వెళుతోంది. అసెంబ్లీ ఎన్నికల వేళ ఈ మేడిగడ్డ బ్యారేజీపై సరైన కౌంటర్ ఇవ్వకపోవడంతో పెద్ద దెబ్బనే తగిలిందని భావిస్తున్న ఆ పార్టీ, ఇప్పుడు ఈ కాళేశ్వరం ప్రాజెక్టు గురించి జనాలకు చూపించి చెప్పేందుకు సిద్ధం అవుతుండడంతో శుక్రవారం నాటి పర్యటన ఎటువైపు మలుపులు తిరుగుతుందోనన్న చర్చ పొలిటికల్ వర్గాల్లో జరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికల వేళ మేడిగడ్డ అంశం ఏ పార్టీకి లాభిస్తుందో, నష్టం చేకూరుస్తుందోనన్న చర్చ సాగుతోంది.



మేడిగడ్డ బ్యారేజీ పియర్‌లో ఏర్పడిన పగుళ్లు (ఫైల్)

అసలు ఏం జరిగిందంటే..

- గత ఏడాది అక్టోబర్ 21వ తేదీన సాయంత్రం 6 గంటల 20 నిమిషాల ప్రాంతంలో మేడిగడ్డ బ్యారేజ్ వద్ద బాంబు పేలినట్లుగా పెద్ద శబ్దం వచ్చింది. 7వ బ్లాకులోని 19, 20, 21 పియర్ల వద్ద డ్యామేజీ జరిగినట్లు ఇంజనీర్లు గుర్తించారు. 20వ పియర్‌తోపాటు దానికి అటు ఇటు ఉండే 18, 19, 21 పియర్లు కుంగాయి. వాటి శ్లాబులు కూడా కుంగాయి. రాత్రి 11 గంటలకు మేడిగడ్డ బ్యారేజీకి చేరుకున్న రామగుండం చీఫ్ ఇంజనీర్ మరింత నష్టం జరగకుండా ఉండేందుకు బ్యారేజీలోని నీటిని వదిలేశారు.
- డిసెంబర్ 24వ తేదీన పియర్ కుంగడం ఆగింది. మొత్తం మీద 1.256 మీటర్లు మేర పియర్ కుంగింది. దెబ్బతిన్న పియర్ల మధ్య గేట్లు జామ్ అయ్యాయి. 16వ పియర్ నుంచి 21వ పియర్ వరకు బ్యారేజీ వంతెన మీద కూడా పగుళ్లు వచ్చాయని అప్పటి ఇంజనీర్‌ఇన్‌చీఫ్ సి.మురళీధర్ రావు రాష్ట్ర ప్రభుత్వానికి వివరించారు.

మేడిగడ్డకు ఎందుకు వెళ్తున్నారో చెప్పాలి

- బీఆర్ఎస్ నేతలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు ప్రశ్న

కాళేశ్వరంపై కాంగ్రెస్ దుష్ప్రచారం..

- ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్

- వివరాలు 8లో▸

విద్యార్థులు కళల్లోనూ రాణించాలి

- జిల్లా విద్యాధికారి రాము

జనగామ రూరల్: విద్యార్థులు చదువులతో పాటు కళల్లోనూ రాణించాలని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. గురువారం పట్టణంలోని ఏకశిల బీఈడీ కళాశాలలో జిల్లా స్థాయి డ్రామా మోనో యాక్షన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకూడదని, వాడితే కలిగే అనర్థాలను తెలుసుకోవాలని చెప్పారు. అనంతరం డ్రామా పోటీలో గెలుపొందిన కేజీబీవీ రఘునాథపల్లి(ప్రథమ), కేజీబీవీ స్టేషన్ ఘన్‌పూర్(ద్వితీయ), జెడ్పీఎస్ఎస్ సింగరాజుపల్లి(తృతీయ), మోనో పోటీలో కేజీబీవీ లింగాలఘణపురం(ప్రథమ), దేవరుప్పుల కేజీబీవీ(ద్వితీయ), జెడ్పీహెచ్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్(తృతీయ) విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు, మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న డీఈఓ రాము

పోస్ట్‌మాస్టర్ అవినీతిపై ఈడీ విచారణ?

కొడకండ్ల : స్థానిక సబ్‌పోస్టాఫీస్‌లో రెండేళ్ల క్రితం వెలుగు చూసిన పోస్ట్‌మాస్టర్ కె.సతీష్ అవినీతిపై ఈడీ దర్యాప్తు చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. రెండేళ్ల పాటు ఇక్కడ పనిచేసిన సమయంలో పోస్ట్‌మాస్టర్ సతీష్ అవినీతిని పసిగట్టిన పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు 2022 జూలై 21న ప్రాథమిక విచారణ చేపట్టారు. రూ.కోటికి పైగా కాజేసినట్లు గుర్తించి అతన్ని సస్పెండ్ చేసి కేసును సీబీఐకి అప్పగించారు. దర్యాప్తు చేసిన సీబీఐ అధికారులు రూ.1.72 కోట్లు ఆన్‌లైన్ ద్వారా సొంత ఖాతాలకు మళ్లించుకునట్లు గుర్తించి సతీష్‌ను అరెస్ట్ చేశారు. తాజాగా పెద్ద మొత్తంలో డబ్బుల మళ్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసినట్లు సమాచారం.

పట్టభద్రుల ముసాయిదా ఓటరు జాబితా

- మార్చి 14 వరకు అభ్యంతరాల స్వీకరణ
- ఏప్రిల్ 4న తుది జాబితా
- 1,828 దరఖాస్తుల తిరస్కరణ



జనగామ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితా విడుదలైంది. ఈనెల 6వ తేదీ వరకు 18 ఫారం ద్వారా దరఖాస్తులు స్వీకరించిన అధికారులు ఓటరు జాబితా డ్రాఫ్టును వెలువరించారు. ఈ నెల 14వ తేదీ వరకు డ్రాఫ్ట్ పబ్లికేషన్‌పై ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఈ ప్రక్రియ తర్వాత క్లైంలు, అభ్యంతరాల పరిష్కారం ముగిసిన వెంటనే.. ఫైనల్ పబ్లికేషన్‌కు సిద్ధం చేస్తారు. ఏప్రిల్ 4వ తేదీన తుది జాబితాను కలెక్టర్ విడుల చేయనున్నారు.

23,698 దరఖాస్తులు

పట్టభద్రులు ఓటరుగా నమోదు కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా జిల్లాలోని 23,698 దరఖాస్తులు వచ్చాయి. మండలాల వారీగా పరిశీలించిన తర్వాత డిగ్రీ పట్టా, తదితర సమగ్ర వివరాలు లేకపోవంతో 1,828 దరఖాస్తులను తిరస్కరించారు. ముసాయిదా జాబితాలో 21,870 ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. ఇందులో పురుషులు 13,991, మహిళలు 7,878, థర్డ్ జెండర్ ఒకరు ఉన్నారు.

ఆందోళనలో..

తిరస్కణకు గురైన పలువురు దరఖాస్తుదారులు ఆందోళనకు గురవుతున్నారు. డిగ్రీ పట్టాతో పాటు సమగ్ర వివరాలను సమర్పించినా ఓటరు జాబితాలో పేరు లేకపోవడంతో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. అభ్యంతరాల స్వీకరణకు 20 రోజుల పాటు సమయం ఉండడంతో మరోసారి డిగ్రీ సర్టిఫికెట్లను అధికారులకు అందించనున్నారు. కాగా ఈసారి ఐదు వేల నుంచి ఆరు వేల వరకు పట్టభద్రుల ఓటర్లు పెరగవచ్చనే అంచనాలు తలకిందులయ్యాయి.

పార్టీల కసరత్తు

పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, ఇతర పార్టీలు మేధావి వర్గం ఓట్లపై దృష్టి సారించాయి. ముసాయిదా ఓటరు జాబితాలో ఉన్న వారికి సంబంధించి ఫోన్ నంబర్లు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఎన్నికలకు చాలా సమయం ఉన్నప్పటికీ పార్టీలకు చెందిన పలువురు ముఖ్య నాయకులు పట్టభద్రులను కలుసుకుంటూ మద్దతు కూడగట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో అప్పుడే ఎన్నికల వాతావరణం నెలకొంది.

జిల్లాలో పట్టభద్రుల ఓటర్ల ముసాయిదా జాబితా

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
నర్మెట	646	349	995
తరిగొప్పుల	346	188	534
బచ్చన్నపేట	1,208	678	1,886
జనగామ	3,300	2,216	5,516
లింగాలఘణపురం	1,033	549	1,582
రఘునాథపల్లి	1,127	606	1,733
స్టేషన్‌ఘన్‌పూర్	1,164	721	1,885
చిల్పూరు	686	364	1,050
జఫర్‌గఢ్	922	498	1,420
పాలకుర్తి	1,577	734	2,311
దేవరుప్పుల	1,154	609	1,763
కొడకండ్ల	828	367	1,195
మొత్తం	13,991	7,879	21,870

ఓటు హక్కును సరిచూసుకోవాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



జనగామ రూరల్: పట్టభద్రులు తమ ఓటు హక్కును సరిచూసుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం జిల్లా పట్టభద్రుల ఓటరు ముసాయిదా జాబితాను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 21వేల మంది పట్టభద్రులు ఓటు హక్కు నమోదుకు అర్హత పొందారని, వీరిలో పురుషులు 13,991, స్త్రీలు 7,878, థర్డ్ జెండర్ ఒకరు ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులంతా ఈనెల 14లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని లేదా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జాబితాలో నమోదైన పేర్లలో అభ్యంతరాలుంటే స్వీకరించి, ఏప్రిల్ 4న తుది జాబితా విడుదల చేస్తామని వివరించారు.

యశోద హాస్పిటల్స్

యశోద మెడికల్ సెంటర్

ఎస్‌బిఐ పక్కన, నక్కలగుట్ట, హన్మకొండ

సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

ప్రత్యేకతలు	వైద్యులు	తేది - సమయం
క్యాన్సర్‌వ్యాధులకు కన్సల్టేషన్	డా॥ ఎమ్.ఆర్. విశ్వతేజ	02-03-2024 1వ శనివారం
ఎండోక్రైనాలజీ వ్యాధులు	డా॥ ఆశిష్ రెడ్డి బండి	03-03-2024 1వ ఆదివారం
వాస్కులర్ కన్సల్టేషన్	డా॥ ఎస్. శ్రీకాంత్ రాజు	
ఆర్థోపెడిక్ / కీళ్ళమార్పిడి కన్సల్టేషన్	డా॥ నితిన్ కుమార్ బి	05-03-2024 1వ మంగళవారం
ఊపిరితిత్తుల వ్యాధులకు కన్సల్టేషన్	డా॥ గోపి కృష్ణ యడ్లపాటి	06-03-2024 1వ బుధవారం
క్యాన్సర్‌వ్యాధులకు కన్సల్టేషన్	డా॥ హేమంత్ ఉదయరాజు	
పిల్లలలో మెదడు & నరాల వ్యాధులకు కన్సల్టేషన్	డా॥ ఎన్. వర్ష మోనికా రెడ్డి	
కిడ్నీ వ్యాధులకు కన్సల్టేషన్	డా॥ మామిడి ప్రణీత్ రామ్	
గ్యాస్ట్రో వ్యాధులకు కన్సల్టేషన్	డా॥ డి. విశ్వనాథ్ రెడ్డి	07-03-2024 1వ గురువారం
మణికట్టు, చేతి & పునర్నిర్మాణ కన్సల్టేషన్	డా॥ మనీష్ కుమార్ జైన్	

అపాయింట్‌మెంట్ కొరకు: 0870 - 2427777 | 2447778 | 2447779

కేవీకే సేవలు ప్రశంసనీయం



కరపత్రం ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

కరీమాబాద్: రైతుల సమస్యల పరిష్కారంతోపాటు వ్యవసాయ రంగంలో పాటించాల్సిన ఆధునిక పద్ధతులను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్న మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం సేవలు ప్రశంసనీయమని పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ జ్ఞాన ప్రకాష్, విస్తరణ సంచాలకుడు మహేందర్ అన్నారు. మామునూరు కేవీకేలో గురువారం ప్రధాన శాస్త్రవేత్త రాజన్న అధ్యక్షతన శాస్త్రీయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భవిష్యత్‌లో రైతుల కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై వారు పలు సూచనలు తెలిపారు. అనంతరం వ్యవసాయ రంగానికి సంబంధించిన కరదీపికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ మాలతి, ఏరువాక కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ దిలీప్‌కుమార్, డాక్టర్ బాలాజీ, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, జిల్లా మత్స్య శాఖ అధికారి నరేష్‌కుమార్ నాయుడు, పశువైద్య సహాయ సంచాలకుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫాదర్ విజయ్‌కుమార్ ఇకలేరు

- అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి
- 40 ఏళ్లలో అనేక సేవలు



విజయ్‌కుమార్ భౌతిక కాయం వద్ద ప్రార్థన చేస్తున్న బిషప్ ఉడుముల బాల

కాజీపేట రూరల్ : విద్యా, సామాజిక, ఆధ్యాత్మికవేత్త ఫాదర్ డాక్టర్ కొమ్మారెడ్డి విజయ్‌కుమార్ రెడ్డి (68) ఇక లేరు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. గురువారం వరంగల్ మెడికేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. విజయ్‌కుమార్ రెడ్డి భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఫాతిమా బిషప్ హౌస్‌కు తరలించారు. నాగార్జున యూనివర్సిటీలో బాటనీలో పీహెచ్‌డీ పూర్తి చేసిన విజయ్‌కుమార్.. 40 ఏళ్ల పాటు అనేక సేవలు అందించారు. దళిత జనోద్ధరణకు కృషి చేసిన విజయ్‌కుమార్ ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్ వరంగల్ డయాసిస్ సెక్రటరీగా సేవలందించారు. సీబీసీఐ రూపొందించిన దళిత పాలసీ అమలుకు కృషి చేశారు. డోర్నకల్, వడ్డేపల్లి, కాజీపేట, సుబేదారి, సెయింట్ పీటర్స్, పాలకుర్తి, అరుణోదయ యూత్ డైరెక్టర్‌గా, క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, విద్యాజ్యోతి డిగ్రీ, పీజీ ప్రిన్సిపాల్‌గా, వరంగల్ మెడికేర్ ఆసుపత్రి డైరెక్టర్‌గా విమ్స్ పరిరక్షణలో కీలక పాత్ర పోషించారు. వరంగల్ మేత్రాసనం పీఠాధిపతి రెవ.డాక్టర్ ఉడుముల బాల.. విజయ్‌కుమార్ రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించారు. విజయ్‌కుమార్ రెడ్డి మృతి డయాసిస్‌కు తీరని లోటన్నారు. కరుణాపురం క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరం వ్యవస్థాపకుడు రెవ.డాక్టర్ సంగాల పాల్సన్‌రాజ్, వరంగల్ మేత్రాసనం డయాసిస్ ఫాదర్లు, విచారణ గురువులు, రాజకీయనాయకులు, తదితరులు తరలివచ్చి విజయ్‌కుమార్ రెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఫాతిమానగర్ శ్మశాన వాటికలో శుక్రవారం సాయంత్రం విజయ్‌కుమార్ రెడ్డి భూస్థాపన కార్యక్రమం ఉంటుందని ఫాదర్లు తెలిపారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661

బాల మేధావుల భారత్..

వినూత్న కార్యక్రమానికి ఇస్రో శ్రీకారం

- 'క్యాచ్ దెమ్ యంగ్' పేరిట యంగ్ సైంటిస్టు ప్రోగ్రామ్
- అంతరిక్ష సాంకేతికత, విజ్ఞానం, అప్లికేషన్స్‌పై అవగాహన
- 2024 జనవరి 1 నాటికి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు
- మార్చి 20వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియ



సైంటిస్టులతో విద్యార్థులు (ఫైల్)

కాశోజీ సెంటర్ : ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాల విద్యార్థుల కోసం నిర్వహించే 'యువవిజ్ఞాని' (యువిక) కార్యక్రమానికి దరఖాస్తులు కోరుతోంది. ఫిబ్రవరి 20వ తేదీ నుంచి దరఖాస్తు స్వీకరణ కార్యక్రమం ప్రారంభంకానుంది. 'క్యాచ్ దెమ్ యంగ్' పేరిట రెండు వారాలు నిర్వహించే ఈ కార్యక్రమంలో అంతరిక్ష సాంకేతికత, విజ్ఞానం, అప్లికేషన్లపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. 2024 జనవరి 1 నాటికి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. విద్యార్థి దశలోనే విజ్ఞానం, సాంకేతికత, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) అంశాలపై అవగాహన కల్పించి, తద్వారా వారిని పరిశోధనల వైపు దృష్టి మళ్లించడమే ఈ కార్యక్రమం లక్ష్యం. ఇస్రో మేటి ప్రయోగాలు చేస్తూ.. ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంటోంది. ఈ క్రమంలో దేశంలోని బాల మేధావులను ప్రోత్సహించే క్రమంలో యంగ్ సైంటిస్టు ప్రోగ్రామ్(యువిక) కార్యక్రమం నిర్వహిస్తోంది. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్లను కూడా ప్రారంభించింది. ఈ నేపథ్యంలో అసలు కార్యక్రమం ఏమిటి? రిజిస్ట్రేషన్ ఎలా చేసుకోవాలి? వంటి వివరాలను తెలుసుకుందాం.

ఎంపిక ఇలా..



యువిక లోగో

8వ తరగతి లేదా చివరిగా నిర్వహించిన పరీక్షలో పొందిన మార్కులు, ఆన్‌లైన్ క్విజ్‌లో పర్ఫార్మెన్స్, సైన్స్ ఫెయిర్‌లలో పాల్గొనడం, ఒలింపియాడ్ లేదా అందుకు సమానమైన పరీక్షల్లో ర్యాంక్, స్పోర్ట్స్ పోటీల్లో విజేతలు, స్కౌట్స్ అండ్ గైడ్స్, మూడేళ్లలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ సభ్యుడిగా పాల్గొనడం, గ్రామీణ ప్రాంతాల్లో చదువుకోవడం వంటి అంశాల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది.

అర్హతలు..

2023–24 విద్యాసంవత్సరంలో 9వ తరగతి చదువుతున్న వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 8వ తరగతిలో సాధించిన మార్కుల ప్రకారం 60శాతం వెయిటేజీ, 2016 నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎస్సే రైటింగ్, చర్చా కార్యక్రమాల్లో ప్రతిభ సాధించినవారికి 10శాతం వరకు వెయిటేజీ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడల్లో ప్రతిభ సాధించినవారికి 5శాతం వెయిటేజీ, గ్రామీణ ప్రాంతాల్లో చదివే వారికి 15శాతం వెయిటేజీ ఉంటుంది.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఇలా..

యువిక 2024 కోసం రిజిస్ట్రేషన్ 2024 ఫిబ్రవరి 20న ప్రారంభమై, మార్చి 20వ తేదీన ముగుస్తుంది. ఔత్సాహిక బాల శాస్త్రవేత్తలు ఈ సువర్ణావకాశాన్ని ఉపయోగించుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. మార్చి 28, 2024న మొదటి ఎంపిక జాబితా విడుదలవుతుంది. రెండో ఎంపిక జాబితా ఏప్రిల్ 4 విడుదల చేస్తారు. ఎంపికైన విద్యార్థులు 2024 మే 13 నుంచి 25వ తేదీ వరకు సుమారు రెండు వారాలు సంబంధిత ఇస్రో కేంద్రాలలో శిక్షణ పొందుతారు. కాగా, 2023లో 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాల నుంచి సుమారు లక్షా35వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా కేవలం 350 మంది మాత్రమే ఎంపికయ్యారంటే అంతరిక్ష సాంకేతికతపై అవగాహన కల్పించడానికి ఎంత వడబోత కార్యక్రమం ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. బాల మేధావులు పరిశోధనల వైపు దృష్టి సారించి వెంటనే https://jigyasa.irs.gov.in/లో నమోదు చేసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు. వివరాలకు వరంగల్ జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్(9848878455)ను సంప్రదించాలన్నారు.

యంగ్ సైంటిస్టులు అయ్యేందుకు సదావకాశం



యువిక కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత్తలు తమ అనుభవాలను పంచుకుంటారు. ఇస్రో నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రతీ రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతం నుంచి ముగ్గురు విద్యార్థుల చొప్పున ఎంపిక చేస్తారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, స్టేట్ సిలబస్ స్కూళ్లల్లో చదివే విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రాధాన్యం ఉంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.

-డి. వాసంతి, డీఈఓ వరంగల్

అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెంచేందుకు..



అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థుల్లోని ఉన్న ఆసక్తిని గుర్తించి, వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు ఇస్రో ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. వరంగల్ జిల్లా నెక్కొండ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి బట్టు నిఖిల్ వర్మ గతేడాది యువిక–2023 ఎంపికై హైదరాబాద్‌లో రెండు వారాలు శిక్షణ పొందాడు. అనంతరం బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయం నుంచి ఆహ్వానం వచ్చింది. అక్కడ చంద్రయాన్ –3 విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ ప్రత్యక్ష ప్రయోగాలను చూశాడు.

-కట్ల శ్రీనివాస్, వరంగల్ జిల్లా సైన్స్ అధికారి

ప్రత్యక్ష ప్రయోగాలు చూశా



ఈ కార్యక్రమం వల్ల మొదటి విమాన ప్రయాణ అనుభవం మాత్రమే కాకుండా ఇస్రో చైర్మన్ ఎస్. సోమనాథ్‌తో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం లభించింది. యువిక కార్యక్రమానికి ఎంపిక కావడం ద్వారా అంతరిక్ష విజ్ఞానానికి సంబంధించిన ప్రత్యక్ష అనుభవాలను తెలుసుకోగలిగా. చంద్రయాన్–3 విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ ప్రత్యక్ష ప్రయోగాలు చూసే అవకాశం దక్కింది.భవిష్యత్‌లో కొత్త ప్రయోగాలు చేసేందుకు మార్గం లభించింది.

-బట్టు నిఖిల్ వర్మ, విద్యార్థి

ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను అరికట్టాలి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ : ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను అరికడుతూ విద్యుత్ అంతరాయాలు తగ్గించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి సూచించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఎంఆర్‌టీ ఉద్యోగుల నాలుగు రోజుల శిక్షణ తరగతుల ముగింపు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎండీ మాట్లాడుతూ శిక్షణ తరగతులతో ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవచ్చన్నారు. సంస్థను మరింత బలోపేతం చేసుకునేందుకు శిక్షణా తరగతులు దోహదపడతాయన్నారు. క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలను ముందుగా గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారాలు కనుగొనాలన్నారు. కొత్త ఆలోచనలు, నిబద్ధతతో పనిచేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు తగ్గించాలన్నారు. వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కంపెనీలోని అన్ని విభాగాల ఉద్యోగులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. అనంతరం శిక్షణ పొందిన ఉద్యోగులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు వి.తిరుపతి రెడ్డి బి. అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి మోహన్ రావు, సీజీఎంలు సి.ప్రభాకర్, టి.మధుసూదన్, అశోక్, కిషన్, రాజు చౌహాన్ పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి



వీరస్వామి మృతదేహం

గూడూరు: పాము కాటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మండలంలోని గోవిందాపురంలో జరిగింది. ఎస్సై నగేష్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఓర్సు వీరస్వామి (43) కుటుంబ సభ్యులతో కలిసి కరీంనగర్‌లో ఉంటున్నాడు. ఇటీవల స్వగ్రామం చేరుకున్నాడు. ఈ క్రమంలో మూత్ర విసర్జన కోసం బయటకు వెళ్లి తిరిగి ఇంట్లోకి వచ్చాడు. ఆ సమయంలో బయట ఏదో జీవరాశి కాటు వేసినట్లు అనిపించిందని తల్లి వెంకటమ్మతో చెప్పి నిద్రించాడు. దీనిపై తల్లికి అనుమానం వచ్చి కొంత సమయం తరువాత చూడగా వీరస్వామి మృతి చెంది కనిపించాడు. వెంటనే కరీంనగర్‌లో ఉన్న మృతుడి భార్య ఉపేంద్రకు సమాచారం అందించింది. గురువారం ఆమె వచ్చి చూడగా నోటి నుంచి నురగలు కనిపించగా బోరున విలపించింది. ఈ ఘటనపై ఉపేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలో వ్యక్తి, వరంగల్ జిల్లా రాయపర్తిలో వృద్ధురాలు, వరంగల్ శంభునిపేటలో యువకుడు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది.



వెంకటేశ్వర్లు (ఫైల్)

ఏటూరునాగారం: ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన బారికేడ్లను ఢీకొని ఓ ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. మండలంలోని షాపెల్లికి చెందిన పాలకుర్తి వెంకటేశ్వర్లు(52) మండల కేంద్రంలో హోటల్ నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం తన స్కూటీపై కూరగాయలు తీసుకొచ్చేందుకు మార్కెట్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో క్రాస్‌రోడ్డు మలుపు పోలీస్‌స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్‌ను ఢీకొనడంతో ఎగిరిపడ్డారు. తీవ్ర గాయాలు కావడంతో ఎస్సై కృష్ణప్రసాద్ వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, కూరగాయల కోసం పోయి కనిపించని లోకాలకు వెళ్లావా అంటూ భార్య, పిల్లలు రోదిస్తున్న తీరును చూసి పలువురు కంటతడి పెట్టారు. మృతుడికి భార్య జ్యోతి, కుమార్తె కీర్తన, కుమారుడు భరత్ ఉన్నారు. ఈ ఘటనపై జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

బారికేడ్లను తొలగించాలి

2001లో ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్‌పై దాడి జరిగింది. దీంతో పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న 163 జాతీయ రహదారిని మూసివేశారు. ఫలితంగా ఐటీడీఏ పీఓ గెస్ట్‌హౌస్ చుట్టూ వాహనాలు వెళ్తున్నాయి. ఈక్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం వెంకటేశ్వర్లు మూసివేసిన దారిపై ఏర్పాటుచేసిన బారికేడ్లనే ఢీకొని మృతి చెందాడు. మూసిన రోడ్డును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రాయపర్తిలో వృద్ధురాలు..



ఆండాలమ్మ (ఫైల్)

రాయపర్తి: రోడ్డు ప్రమాదంలో ఓవృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున మండలకేంద్రంలో జరిగింది. ఎస్సై సందీప్‌కుమార్ కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన చింతనూరి ఆండాలు(70) తన బంధువుల ఇంటికి వెళ్లడానికి వరంగల్, ఖమ్మం జాతీయ రహదారి పక్క నుంచి నడుచుకుంటూ బస్టాండ్‌కు వస్తోంది. ఈ క్రమంలో గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో ఆండాలు అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనపై మృతురాలి బంధువు చింతనూరి ప్రభాకర్ రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కరీమాబాద్‌లో యువకుడు..



సాయితేజ్ (ఫైల్)

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట నాగమయ్య కమాన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఉర్సు కరీమాబాద్‌కు చెందిన వడ్డెపెల్లి సాయి తేజ్(27) అపోలో ఫార్మసిస్ట్‌గా పనిచేస్తున్నారు. బుధవారం సాయంత్రం స్నేహితుడి ఇంట్లో జరిగిన వేడుకలకు హాజరయ్యాడు. వేడుకలు ముగిసిన అనంతరం రాత్రి బైక్‌పై తన ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో నాగమయ్య కమాన్ సమీపంలో డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో సాయి తేజ్ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన 108లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మున్నీర్ ఉల్లా తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

B.Sc. NURSING ADMISSIONS

■ B.Sc Nursing (Boys & Girls) Admissions available 2023-2024 at Medha Institute of Nursing & Diagnostic Sciences, Near Relief Hospital, Paidipally, Warangal. NO EAMCET, NO NEET, Only 10+2. Contact (or) Whatsapp: 8801456289, 7675882992. [WA-0355]

SERVICES

డాక్యుమెంట్స్ పోయినవి

■ వరంగల్‌లోని లేబర్‌కాలనీ నుండి శివనగర్‌కు ఆటోలో వెళ్తుండగా పుప్పాలగుట్ట వద్ద దివి: 08-06-2023 నాడు ఒరిజినల్ రిజిస్టర్డ్ డాక్యుమెంట్స్ పోయినవి. నెం.6175/2018 మరియు 5063/2019. దొరికినవారు ఈ నెంబర్‌కు తెలుపగలరు. దేవునూరి సబిత – సెల్: 9000968512. [W-1200991]

FURNITURE FOR SALE

■ G.P. Mess హోటల్ ఫర్నీచర్ అమ్మబడును. ఎర్రగట్టుగుట్ట. వెంటనే సంప్రదించండి।। సెల్: 9705864281. [M-10594]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

WANTED

■ శ్రీబాలాజీ సోలార్ ఎనర్జీస్‌లో పని చేయుటకు సోలార్ టెక్నీషియన్స్–5, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్–5, అకౌంటెంట్–1, గ్రాఫిక్ డిజైనర్–1, రిసెప్షనిస్ట్–1, టెలికాలర్స్–3 కావలెను. సంప్ర।। చింతల నరసింహులు కాంప్లెక్స్ పైన, లష్కర్‌బజార్, HNK. Cell: 9515954923, 8885003401. [W-1200867]

■ యువరాజ్ కిరాణంలో పని చేయుటకు కిరాణంలో 3సం. చేసిన అనుభవం గల యువతీ యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం. వరంగల్ లోకల్ వారికి మాత్రమే. సంప్ర: అండర్‌బ్రిడ్జి దగ్గర, వరంగల్. 9490133696. [WA-7296]

■ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 13000 -16000. సంప్ర।। 9000463426. [W-1220896]

■ Wanted Technicians 10th, ITI (P/F) at Rampur Industrial Area Kazipet (8K to 10K). Contact: Cell: 7981016232. [WA-7295]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సాప్ చేయగలరు. 9059663584. [M-1233860]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం స్త్రీ/పు కావలెను. జీతం : 15-25 వేలు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సాప్ చేయగలరు. సంప్ర. 95027 12418, 90306 12463. [M-1233865]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

మేడిగడ్డకు ఎందుకు వెళ్తున్నారో చెప్పాలి

- సీఎం కుర్చీపై ఇంకా మోజు తీరని బీఆర్ఎస్
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

హన్మకొండ: మేడిగడ్డకు ఎందుకు వెళ్తున్నారో... ఏమి పాఠాలు ఎవరికి నేర్పుతారో బీఆర్ఎస్ చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మేడిగడ్డలో కుంగిపోయిన పిల్లర్ల స్థానంలో పునర్నిర్మాణం చేపట్టడం చేతగాకపోతే సీఎం పదవి తమకు ఇస్తే చేసి చూపిస్తామని ఎమ్మెల్యే హరీష్‌రావు అంటున్నారని, సీఎం పదవి తీసుకోవడానికి మీరెవరు... ఇవ్వడానికి రేవంత్ రెడ్డి ఎవరని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు సీఎం పదవిపై ఇంకా మోజు తీరలేదని ఎద్దేవా చేశారు. అధికారం లేక కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు మతిస్థిమితం కోల్పోయి పిచ్చివారిలా ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. అసెంబ్లీలో ప్రభుత్వం ఆర్థిక స్థితిగతులు, విద్యుత్, కృష్ణా జలాలు, ప్రాజెక్టులు, కాళేశ్వరంపై విడుదల చేసిన శ్వేతపత్రాలతో బీఆర్ఎస్ నిజ స్వరూపం, మోసాలు ప్రస్ఫుటంగా ప్రజలకు తెలిశాయన్నారు. అయినా ఇంకా కేసీఆర్ అద్దాలమేడలో ఉంటూ రాళ్లు వేయాలని చూస్తున్నారని విమర్శించారు. నల్లగొండ సభలో కేసీఆర్ మేడిగడ్డకు ఎందుకు వెళ్తున్నారో అని శాసన సభ్యులనుద్దేశించి వ్యాఖ్యానించారని, ఇప్పుడు బీఆర్ఎస్ ఎందుకు వెళ్తుందని ప్రశ్నించారు. ఇండియా కూటమిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పైనే ఉందన్నారు. కమ్యూనిస్టుల మద్దతుతోనే అసెంబ్లీలో కాంగ్రెస్ మెజారిటీ సీట్లు సాధించిందన్నారు. మిత్ర ధర్మం మరువొద్దన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తమకు ఒక్క స్థానం ఇవ్వాలని కోరారు. అందరి వాడైన రామున్ని ఓట్ల కోసం బీజేపీ బందీ చేసిందన్నారు.సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకురాలు నేదునూరి జ్యోతి, బి.విజయసారథి, పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, మంద సాదాలక్ష్మి, సిరబోయిన కరుణాకర్, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్ దుష్ప్రచారం..

- ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్



మేడిగడ్డ బ్యారేజీ వద్ద బాల్క సుమన్, పుట్ట మధుకర్, ఇతర నాయకులు

కాళేశ్వరం: బీఆర్ఎస్ పార్టీ నిర్మించిన కాళేశ్వరం వరప్రదాయినిపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేసి దుష్ప్రచారం చేస్తోందని ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్ అన్నారు. ఆయన గురువారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధుకర్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డలో 85పియర్‌లలోని ఒక పియర్ కుంగితే బ్యారేజీ మొత్తం ఇబ్బందిపాలైందని ప్రచారం చేస్తున్నారన్నారు. బ్యారేజీలో కాఫర్ డ్యాం నిర్మించి నీటిని నిల్వ చేసి కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటి ఎత్తిపోయాల్సిన ప్రభుత్వం 22 జిల్లాల రైతుల పొట్ట కొడుతోందన్నారు. ప్రస్తుతం 5–6వేల క్యూసెక్కుల నీరు దిగువకు తరలిపోతుందని, రైతులకు నీరు ఇవ్వకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. కేటీఆర్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులందరూ శుక్రవారం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను పరిశీలించి వివరాలు ప్రజలకు తెలపడానికి రానున్నారన్నారు. వారివెంట కాళేశ్వరం దేవస్థానం చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ శ్రీపతి బాపు, రాష్ట్ర నాయకులు బాలమల్లు, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, వాసుదేవారెడ్డి, జక్కు రాకేష్, అలీమ్‌ఖాన్, జవ్వాజీ తిరుపతి తదితరులు ఉన్నారు.

మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం



మేడారం హుండీల లెక్కింపు చేపడుతున్న సిబ్బంది



హుండీలో భక్తులు వేసిన బంగారం, వెండి కానుకలు

- మొదటి రోజు లెక్కింపులో లభించిన ఆదాయం రూ. 3.15 కోట్లు



హుండీలో భక్తులు వేసిన విదేశీ కరెన్సీ

హన్మకొండ కల్చరల్ : మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర హుండీల లెక్కింపు గురువారం హనుమకొండ లష్కర్‌బజార్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రారంభమైంది. మొదటిరోజు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు లెక్కింపు జరిగింది. 134 ఐరన్ హుండీలను దేవాదాయశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సీసీ కెమెరాల నిఘాలో లెక్కింపు నిర్వహించారు. మొదటి రోజు ఆదాయం రూ. 3,15,40,000 (మూడు కోట్ల పదిహేను లక్షల నలభై వేలు) లభించింది. ఈ డబ్బును బ్యాంకులో జమ చేశామని మేడారం ఈఓ రాజేంద్రం ప్రకటించారు. లభించిన నాణెల లెక్కింపు పూర్తికాలేదని తెలిపారు. అలాగే, హుండీల్లో లభించిన బంగారం, వెండి కానులను అధికారుల సమక్షంలో ఐరన్ హుండీలో భద్రపరిచామని తెలిపారు. అంతకుముందు దేవాదాయ, ధర్మాదాయశాఖ వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావు, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, జాతర ఈఓ రాజేంద్రం, పరకాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, మేడారం ప్రధాన పూజారి జగ్గారావు, ఆర్డీఓ సత్యపాల్, తహసీల్దార్ రాజేందర్ పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ, రెవెన్యూశాఖ సిబ్బంది, శ్రీలక్ష్మి వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

జాతరలో ఏర్పాటు చేసిన హుండీల వివరాలు...

సమ్మక్క గద్దె వద్ద 215 హుండీలు, సారలమ్మ గద్దె వద్ద 215, పగిడిద్దరాజు వద్ద 26, గోవిందరాజు గద్దె వద్ద 26, ఒడిబియ్యం హుండీలు 2, క్లాత్ హుండీలు 34, మొత్తం 518 హుండీలు ఏర్పాటు చేశారు. మొదటిరోజు 134 హుండీల లెక్కింపు నిర్వహించారు.

కరెన్సీపై అంబేడ్కర్ బొమ్మ ముద్రించాలి..



హుండీలో లభించిన నకిలీ రూ.వంద నోట్లు

హుండీలో కొందరు నకిలీ కరెన్సీ వేశారు. 'కరెన్సీపై అంబేడ్కర్ బొమ్మ ముద్రించాలి' అని ఆరు వంద రూపాయల నోట్లపై రాసి ఉంచారు. వాటిని గుర్తించిన అధికారులు పక్కన పడేశారు.

ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జ్యోతి

- కాలేజీ చరిత్రలో తొలిసారి మహిళా ప్రొఫెసర్‌కు అవకాశం



ఆచార్య ఎస్.జ్యోతి

కేయూ క్యాంపస్: యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కెమిస్ట్రీ విభాగం ఆచార్యులు డాక్టర్ ఎస్.జ్యోతి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకు కాలేజీ ప్రిన్సిపాల్‌గా కొనసాగిన బన్న అయిలయ్య ఉద్యోగ విరమణ పొందారు. ఆ స్థానంలో జ్యోతి నియమితులయ్యారు. ఆమె కాకతీయ యూనివర్సిటీలో 2007లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులై ప్రొఫెసర్ స్థాయికి ఎదిగారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఉత్తమ ఎన్ఎస్ఎస్‌గా రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ప్రస్తుతం అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

వందేళ్ల చరిత్రలో ఆర్ట్స్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా తొలిమహిళ

యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఏర్పాటై వందేళ్లు కాబోతున్నాయి. తొలిసారిగా ఓ మహిళకు ప్రిన్సిపాల్‌గా అవకాశం లభించింది. జ్యోతి ఇదే ఆర్ట్స్ కాలేజీలో 1992–1995లో బీఎస్సీ డిగ్రీ కూడా చదివారు. తాను చదివిన కాలేజీకి ప్రిన్సిపాల్‌గా రావడం ఆనందంగా ఉందని ఆమె 'సాక్షి'తో తెలిపారు.